సాక్షి ఆదిలాబాద్

మంగళవారం ၊ 20 ၊ ఆగస్టు ၊ 2024

జవాన్ విగ్రహానికి రాఖీ కట్టిన సోదరి

ఇంద్రవెల్లి: మండలంలోని అందునాయక్ తండా గ్రామానికి చెందిన గోతి ప్రకాశ్ కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందాడు. ఈ మేరకు ఆయన స్మారకంగా గ్రామ సమీపంలో విగ్రహం ఏర్పాటు చేశారు. సోమవారం రక్షాబంధన్ సందర్భంగా విగ్రహానికి ఆయన సోదరి అంకిత రాఖీ కట్టి తన అనుబంధాన్ని చాటింది. ఏటా రాఖీ కడుతున్నట్లు ఆమె పేర్కొంది.



ఎమ్మెల్యే బొజ్జుకు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



ఎంపీ నగేశ్‌కు రాఖీ కడుతున్న రంగినేని మనీషా



ఎమ్మెల్యే అనిల్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరీమణులు



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న రేవతి బెహన్



అదనపు ఎస్పీకి రాఖీ కడుతున్న మహిళా పోలీసు



ఘనంగా రక్షాబంధన్

కైలాస్‌నగర్/ఆదిలాబాద్‌టౌన్/నేరడిగొండ/ఉట్నూర్‌రూరల్/ఆదిలాబాద్: రక్షాబంధన్ వేడుకలను జిల్లావాసులు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం వారు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వచ్చి కలెక్టర్ రాజర్షి షా, ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాతో పాటు అధికారులకు రాఖీలు కట్టారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆయన సోదరీమణులు రాఖీలు కట్టారు. మిఠాయిలు తినిపించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ పోతారం శ్రీనివాస్‌కు మహిళా ఏఎస్సైలు జైస్వాల్ కవిత, వెంకటమ్మ రాఖీలు కట్టారు. ఉట్నూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు మంత్రి సీతక్క హైదరాబాద్‌లో రాఖీ కట్టారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌కు ఆదిలాబాద్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రంగినేని మనీషా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈవోగా సాయన్న బాధ్యతలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జెడ్పీ సీఈవోగా డీఆర్డీవో జి.సాయన్నకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాజర్షి షా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు సీఈవోగా పనిచేసిన రత్నమాల గత నెల 31న పదవీ విరమణ పొందారు. డిప్యూటీ సీఈవోగా ఉన్న కలిందిని ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. ఆమె ఈ నెల 17నుంచి 21వరకు సెలవుపై వెళ్లారు. అయితే ఆమె తిరిగి జిల్లాకు వచ్చేందుకు సముఖంగా లేనట్లుగా తెలిసింది. ఈ నేపథ్యంలో డీఆర్డీవోకు జెడ్పీ సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ సీఈవో విధుల్లో చేరనట్లెతై ఆ బాధ్యతలు సైతం ఆయనే నిర్వర్తించనున్నట్లుగా జెడ్పీవర్గాల సమాచారం.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: సైబర్‌క్రైమ్ విషయంలో ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ కళాశాలలో విద్యార్థులకు సైబర్‌క్రైమ్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఇటీవల కేటుగాళ్లు సైబర్ మోసాలకు పాల్పడుతున్న తీరును వివరించారు. ఫోన్లకు లింకులు పంపించడం, అధికారులు, పోలీసులమని చెప్పి భయాందోళనకు గురిచేస్తున్నట్లు పేర్కొన్నారు. పిల్లలు మత్తు పదార్థాల కేసుల్లో ఇరుక్కున్నారని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి డబ్బులు వసూలు చేసే యత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి వాటిపై స్పందించవద్దని పేర్కొన్నారు. వెంటనే సమీప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్లలో అపరచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని, సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్ చౌహాన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అప్రెంటీస్‌షిప్ మేళా

ఆదిలాబాద్‌టౌన్: ఐటీఐ ఎలక్ట్రీషియన్స్, ఫిట్టర్స్, వెల్డర్స్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థుల ప్రయోజనార్థం సంగారెడ్డి జిల్లాకు చెందిన తోషిబా ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లోని మల్లెపల్లి ఐటీఐ కళాశాలలో అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రొడ్డ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు రూ.11వేల స్టైఫండ్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హులైన వారు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యాక్షన్ ప్లాన్

- డెంగీ కేసుల కట్టడికి 'అర్బన్' కార్యాచరణ
- 'బల్దియా' పారిశుధ్యంపై స్పెషల్ ఫోకస్
- వైద్య, ఆరోగ్య, మున్సిపల్, మెప్మాశాఖలకు బాధ్యతలు
- నేటి నుంచి క్షేత్రస్థాయిలోకి అధికారులు, సిబ్బంది



పట్టణంలోని శాంతినగర్‌లో నీటి తొట్టెలను ఇటీవల పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కృష్ణారావు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో డెంగీ కేసుల కట్టడికి యంత్రాంగం దృష్టి సారించింది. ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. ఈ మేరకు అర్బన్ యాక్షన్ అమలుపై మున్సిపల్, వైద్యఆరోగ్య, మెప్మా శాఖల అధికారులతో కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని వార్డులను ఆరు బ్లాక్‌లుగా విభజించారు. ఒక్కో బ్లాక్‌కు ఆయా శాఖల నుంచి ఒక్కో టీం లీడర్‌ను ఎంపిక చేశారు. వారి ఆధ్వర్యంలో ఆయా శాఖల సిబ్బంది నేటి నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. వ్యాధులు ప్రబలకుండా అనుసరించాల్సిన కార్యాచరణపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వైద్యసేవలు అందించనున్నారు. పారిశుధ్య నిర్వహణ పర్యవేక్షణతో పాటు పరిశుభ్రతపై ప్రజలను చైతన్యవంతం చేయనున్నారు.

నేటి నుంచి రంగంలోకి..

ఆయా బ్లాక్‌లలో టీం లీడర్ల ఆధ్వర్యంలో ఎంపిక చేసిన సిబ్బంది క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగనున్నారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ సూపర్‌వైజర్లు, బ్రీడింగ్ చక్కర్లు, బల్దియా పారిశుధ్య జవాన్లు, కార్మికులు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సీసీలు, ఇతర సిబ్బంది అంతా ఆయా బ్లాక్‌ల పరిధిలోని వార్డుల్లో పర్యటించనున్నారు. పారిశుధ్య నిర్వహణ లోపంతోనే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున దానిపైనే స్పెషల్ ఫోకస్ పెట్టనున్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయించడంతో పాటు యాంటీలార్వా, ఫాగింగ్, స్ప్రే వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. జ్వర పీడితులను గుర్తించడంతో పాటు అవసరమైన వారికి వైద్య సిబ్బంది చికిత్స అందించనున్నారు. అలాగే పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. వారం పాటు 49 వార్డుల్లో ఈ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నారు. ఇలా నెలలో మూడు సార్లు నిర్వహించనున్నారు. తద్వారా పారిశుధ్య సమస్యను దూరం చేయడంతో పాటు దోమల వృద్ధిని తగ్గించి డెంగీ కేసులను నియంత్రించవచ్చని యంత్రాంగం భావిస్తోంది.

49 వార్డులు.. ఆరు బ్లాక్‌లు

మున్సిపల్ పరిధిలో మొత్తం 49 వార్డులుండగా వాటి పరిధిలో ఇప్పటి వరకు అధికారికంగానే 34 డెంగీ కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా ఎక్కువగా ఉంటాయి. ఈ మేరకు అప్రమత్తమైన యంత్రాంగం వాటి కట్టడికి చర్యలు చేపట్టింది. పట్టణ పరిధిలో ఐదు ఆరోగ్య కేంద్రాలు, ఆదిలాబాద్ రూరల్ మండలం పరిధిలో అంకోలి పీహెచ్‌సీ ఉంది. ఒక్కో హెల్త్ సెంటర్ పరిధిలోని మున్సిపల్ వార్డులను కలిపి బ్లాక్‌గా పరిగణించి ఆరు బ్లాక్‌లుగా విభజించారు. ఒక్కో బ్లాక్‌లో 7 నుంచి 9 వార్డులు ఉండగా అత్యధికంగా అంకోలి పీహెచ్‌సీ పరిధిలో 14 ఎంపిక చేశారు. ఆయా బ్లాక్‌లలో జ్వరాల కట్టడికి చేపట్టాల్సిన చర్యలను పర్యవేక్షించేందుకు గాను వైద్య ఆరోగ్యశాఖ నుంచి సంబంధిత పీహెచ్‌సీ, యుహెచ్‌సీ వైద్యాధికారి, మున్సిపల్ నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్, మెప్మా నుంచి కమ్యూనిటీ కోఆర్డినేటర్ (సీసీ)లను టీం లీడర్లుగా ఎంపిక చేశారు. వీరంతా ఆయా బ్లాక్‌లలో విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టనున్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

అర్బన్ డెంగీ యాక్షన్ ప్లాన్‌ను సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ పకడ్బందీగా అమలు చేయాలి. డెంగీతో పాటు ఇతర సీజనల్ వ్యాధులను కట్టడి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. అవసరమైతే వైద్య శిబిరాలు నిర్వహించాలి. పారిశుధ్య సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆయా శాఖలు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా ముందుకు సాగాలి.

– రాజర్షి షా, కలెక్టర్

కురిసిన వర్షం.. పొంగిన వాగులు



రుయ్యాడి వద్ద పొంగిపొర్లుతున్న వాగు

తలమడుగు/బజార్‌హత్నూర్: జిల్లాలోని తలమడుగు, బజార్‌హత్నూర్ మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. మూడు గంటల పాటు కురిసిన వర్షానికి పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోలెవల్ వంతెనల వద్ద వరద ఉధృతి పెరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనదారులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



బజార్‌హత్నూర్ వద్ద వాగు దాటుతూ..



డొర్లి గ్రామ సమీపంలో వాగు ఉధృతి

గ్రీవెన్స్‌కు 'రాఖీ' ఎఫెక్ట్

- ప్రజావాణికి నామమాత్రంగా అర్జీలు
- దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్

కైలాస్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ఈ వారం రాఖీ పండుగ ప్రభావం కనిపించింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి అర్జీదారులు మందకొడిగా హాజరయ్యారు. పింఛన్, స్వయం ఉపాధి రుణాల మంజూరు, భూ సమస్యలు వంటి తదితర అంశాలపై 35 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. పండుగ అయినప్పటికీ నిర్ణీత సమయానికే కలెక్టర్ సమావేశమందిరానికి చేరుకున్నారు. ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవిలతో కలిసి మధ్యాహ్నం 2గంటల వరకు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో డీఆర్డీవో సాయన్న, ఆర్డీవో వినోద్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

అర్జీల పెండింగ్‌పై కలెక్టర్ సీరియస్

అనంతరం ప్రజావాణి అర్జీల పెండింగ్‌పై కలెక్టర్ సమీక్షించారు. పలువురు అధికారులను మందలించారు. పెండింగ్ విషయంలో టాప్‌టెన్‌లో ఉండే వారిపై కఠినంగా వ్యవహరించనున్నట్లు స్పష్టం చేశారు. గిరిజన సంక్షేమ ఈఈ పరిధిలో 65 అర్జీలు, అలాగే ట్రాన్స్‌కో, పీఆర్, మున్సిపల్, రెవెన్యూ, జెడ్పీ, అటవీశాఖల్లో అత్యధిక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించేలా శ్రద్ధ వహించాలన్నారు. వచ్చే వారం మరోసారి అర్జీలపై సమీక్షిస్తానని ప్రగతిలో మార్పు రాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రుణమాఫీ రాలేదా.. ఆందోళన వద్దు

- ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకాధికారులు
- రైతు వేదికల్లో నేటి నుంచి అందుబాటులో

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ప్రకటించిన రైతు రుణమాఫీని మూడు విడతలుగా అమలు చేసింది. అయితే ఈ మూడు విడతల్లోనూ జిల్లాలో వందలాది మంది రైతులకు మాఫీ కాలేదు. దీంతో ఆగ్రహించిన అన్నదాతలు పలు చోట్ల రోడ్డెక్కారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఏకంగా సీఎం దిష్టి బొమ్మతో శవయాత్రలు నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలు తీవ్రతరం కానున్న నేపథ్యంలో యంత్రాంగం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. రుణమాఫీకి సంబంధించి రైతుల్లో ఉన్న అపోహలు దూరం చేయడంతో పాటు వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించేందు కోసం మండలానికో నోడల్ అధికారిని నియమించింది. మండల వ్యవసాయాధికారులు లేని చోట్ల ఏఈవోలకు ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ నోడల్ అధికారులు తమకు కేటాయించిన మండలంలోని రైతు వేదికలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉండి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. వ్యవసాయశాఖకు సంబంధించిన గ్రీవెన్స్ పోర్టల్‌లో ఈ ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత బ్యాంకులకు చేరే విధంగా చర్యలు చేపట్టనున్నారు. పది రోజుల్లో సమస్యను పరిష్కరించేలా నోడల్ అధికారులు సహాయపడుతారని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు. జిల్లాలోని రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా అర్హత కలిగి ఉండి రుణమాఫీ జరగని పక్షంలో తమ ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, పట్టా పాస్‌బుక్‌తో నోడల్ అధికారిని సంప్రదించాలని సూచించారు.

రైతు రుణమాఫీ వివరాలు

విడత	రైతులు	మాఫీ సొమ్ము (రూ.కోట్లలో)
మొదటి	18,821	120.79
రెండో	17,647	201.83
మూడో	19,493	286.26
మొత్తం	55,961	608.88

మండలం	అధికారి పేరు	సెల్ నంబర్
ఆదిలాబాద్‌అర్బన్	ఏ.వివేక్	7288894007
ఆదిలాబాద్‌రూరల్	పి.ప్రకాశ్	7288894028
మావల	గంగారెడ్డి	9014208627
జైనథ్	ఎండీ.అష్రఫ్	7288894029
బేల	సంధ్యారాణీ	7288894030
గాదిగూడ	దివ్య	7288894078
నార్నూర్	దేవేందర్	9440716255
ఇచ్చోడ	జే.కైలాస్	7288894031
సిరికొండ	ప్రవీణ్‌కుమార్	9014208726
గుడిహత్నూర్	బి.రమేశ్	7288894032
తలమడుగు	ప్రమోద్‌రెడ్డి	7288894034
తాంసి	రవీందర్	7288894033
భీంపూర్	బి.శంకర్	9014208739
ఉట్నూర్	జి.రమేశ్	7288894052
ఇంద్రవెల్లి	గణేశ్	7288894051
బోథ్	విశ్వమిత్ర	7288894035
నేరడిగొండ	భాస్కర్	7288894037
బజార్‌హత్నూర్	కె.అరుణ	7288894036

రుణమాఫీ.. మహాప్రభో

- వర్తింపజేయాలని కలెక్టర్‌కు రైతుల మొర

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి అర్హులైనా తమకు వర్తించలేదంటూ జిల్లాలోని పలువురు రైతులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఇంద్రవెల్లి మండలం ధనోరా, బజార్‌హత్నూర్ మండలంలోని పిప్పిరి, ఇచ్చోడకు చెందిన పలువురు రైతులు కలెక్టర్ రాజర్షి షాను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల మూడో విడతలో రూ.2లక్షల్లోపు రుణాలు మాఫీ చేయగా.. బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర ఖాతాదారులైన తమకు మాత్రం రుణం మాఫీ కాలేదన్నారు. మండల వ్యవసాయాధికారులను సంప్రదిస్తే ప్రభుత్వం పంపిన జాబితాలో మీ పేర్లే లేవని చెబుతున్నారని, బ్యాంకు అధికారులను సంప్రదించగా పట్టించుకోవడం లేదన్నారు. ఈ మేరకు కలెక్టర్ స్పందిస్తూ అర్హులైన ప్రతీ రైతుకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఎలాంటి ఆందోళన చెందకుండా వివరాలను సంబంధిత ఏవోలకు అందజేయాలని సూచించారు.



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన రైతులు

కిటకిటలాడిన బస్టాండ్

రక్షాబంధన్ పురస్కరించుకొని ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ సోమవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. తమ సోదరులకు రాఖీలు కట్టేందు కోసం మహిళల రాకపోకలతో బస్సులు కిక్కిరిసిపోయాయి. పరిమితికి మించి ప్రయాణించాల్సి వచ్చింది. - ఆదిలాబాద్





క్లుప్తంగా

ఇద్దరిపై కేసు నమోదు

ముథోల్: విధులకు ఆటంకం కలిగించినందుకు ఇద్దరిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఎడ్‌బిడ్ గ్రామంలో ఆగస్టు 15న మిషన్ భగీరథ పంపుహౌజ్‌లో పనిచేసే వాటర్‌మెన్ ప్రభాకర్ గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టడంతో విషయం తెలుసుకున్న ఏఈఈ దుర్గం సుమన్ సంఘటన స్థలానికి వెళ్లారు. దీంతో మండలంలోని కారేగాం గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి, రాజారెడ్డి అతనిపై దాడి చేసినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులపై 132 బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల్‌పేట్‌కు చెందిన రవి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ కాలనీలో ఉన్న బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో స్థానికులు గమనించి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా 15 గ్రాముల బంగారం, 15 తులాల వెండి, రూ.6 వేల నగదు పోయినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకాలనీకి చెందిన షబాన బేగం ఈ నెల 17న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తన కుమారుడిని నాందేడ్‌లోని దారులూమ్‌లో చదివిద్దామని కుటుంబ సభ్యులు, కుమారుడికి చెప్పగా వారు అందుకు అంగీకరించలేదు. దీంతో మనస్తాపానికి గురై ఇంటినుంచి బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మహిళ భర్త నసీర్ సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో హెడ్ కానిస్టేబుల్ మదన్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

వాగులో పడి ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

సారంగపూర్: మండలంలోని దుప్యాతండాకు చెందిన రాథోడ్ రంజిత్ కుమార్ అనే రైతుకు చెందిన ఎద్దు సోమవారం గ్రామ సమీపంలోని వాగులో మునిగి మృతి చెందింది. బాధిత రైతు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రంజిత్ తన ఎద్దులను మేతకు తీసుకెళ్లాడు. వాటిని వాగు దాటించే క్రమంలో ప్రమాదవశాత్తు ఒక ఎద్దు వాగులో చిక్కుకుపోయింది. దానిని గమనించని సదరు రైతు మిగతా ఆవులు, ఎద్దులను తోలుకుని ఇంటికెళ్లాడు. ఎద్దు లేదని గుర్తించి వాగులో వెతకగా మృతి చెంది కనిపించింది. వెంటనే స్థానిక రైతుల సహాయంతో దానిని బయటకు తీయించారు. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.38 వేల వరకు ఉంటుందని బాధిత రైతు రోదిస్తూ తెలిపాడు.

బడుల్లో ఆటంకం..!

- ఆటలకు కేటాయించని సమయం
- పాఠశాలల్లో కానరాని మైదానాలు
- వెక్కిరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ ఖాళీలు


క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: క్రీడలు విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి. విద్యార్థులకు రోజువారీ శారీరక వ్యాయామం అవసరం. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై సులభంగా దృష్టి సారించే అవకాశం ఉంటుంది. ఆత్మ విశ్వాసం, మానసిక చురుకుదనానికి దోహదపడే క్రీడలకు ఆటంకం కలుగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చాలా పాఠశాలల్లో క్రీడా మైదానాలు, ఆటల పీరియడ్‌లు లేవు. పలు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు కూడా భర్తీ, క్రీడలకు ఆటస్థలాలు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరం కావాల్సిన పరిస్థితి. పాఠశాలల్లో రోజూ గంట పాటు ఆటల పీరియడ్ కేటాయించాలని ఇటీవల శాసనమండలిలో ఎమ్మెల్సీల అభ్యర్థనతో డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించి క్రీడలకు ప్రాధాన్యతపై విద్యాశాఖకు ఆదేశాలిస్తామన్నారు. పలు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, క్రీడలకు స్థలాలు లేకపోవడంతో ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

క్రీడలకు దూరం

పాఠశాలల్లో వార్షికోత్సవమో.. పంద్రాగస్టు, రిప్లబిక్ డే సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు మినహా మిగిలిన సమయాల్లో తక్కువే. డ్రిల్ పీరియడ్ మరిచిపోయి చదువుపై దృష్టి పెట్టడంతో విద్యార్థులకు ఆటలంటే ఏమిటో తెలియకుండా పోతోంది. అడపాదడపా క్రికెట్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించడం తప్పా మరో ఆట తెలియకుండా పోతోంది. ప్రభుత్వ పాఠశాలలు ఉన్నా పీఈటీలు లేకపోవడం, మెజార్టీ ప్రైవేట్ పాఠశాలల్లో మైదానాలు లేకుండా పోయాయి. మంచిర్యాల జిల్లాలోని 1,083 పాఠశాలల్లో 1,12,685 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో ప్రభుత్వ, లోకల్ బాడీ 724 పాఠశాలల్లో 33,425 మంది, రెసిడెన్షియల్, ఇతర ప్రభుత్వ 136 పాఠశాలల్లో 20,182 మంది, 221 ప్రైవేటు పాఠశాలల్లో 58,033 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 646 పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఆటలకు సమయం కేటాయించకపోవడంతో క్రీడలపై విద్యార్థులకు ఆసక్తి లేకుండా పోయింది.

క్రీడాపోటీల నిర్వహణ ఎలా..

మంచిర్యాల జిల్లాలో 110 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం 34 పీఈటీ పోస్టులను పీడీ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసింది. ఇద్దరు పీఈటీలుగా పనిచేస్తున్నారు. ఇంకా రెండు పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ఉంటే ఇద్దరికి కూడా పీడీలుగా ప్రమోషన్ అవకాశం లభించేది. పార్ట్‌టైం పీఈటీలు 10 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. 47 మంది పీడీలు, ఇద్దరు పీఈటీలు పనిచేస్తుండగా రెండు పీడీ, నాలుగు పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 45 ఉన్నత పాఠశాలల్లో పోస్టులు మంజూరు చేయాల్సి ఉంది. ప్రైవేట్ పాఠశాలలు భవనాల్లో సాగిస్తుండగా క్రీడామైదానాలు కనిపించని పరిస్థితి. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు, ట్యూషన్లతో పాటు హోంవర్క్‌లకే పరిమితం కావడంతో ఆటలపై ఆసక్తి అంతంత మాత్రంగానే మారింది.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	మొత్తం పాఠశాలలు	ఆటస్థలం ఉన్నవి	పీఈటీ పోస్టులు	ఖాళీలు
మంచిర్యాల	1,083	646	57	06
ఆదిలాబాద్	785	120	34	04
నిర్మల్	735	590	53	07
కుమురంభీం	732	68	27	02

దాతల సహకారంతోనే..

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలు దాతల సహకారం కోసం ఎదురు చూడక తప్పడం లేదు. ఇప్పటికే జిల్లా, జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల క్యాలెండర్ విడుదలైంది. కానీ నిధులు కేటాయించకపోవడంతో పోటీలు ఎలా నిర్వహిస్తారనేది తెలియకుండా పోయింది. డీసీఈబీ ప్రతీ విద్యార్థి నుంచి వసూలు చేసే పరీక్ష ఫీజు నుంచి మూడు రూపాయలు ఎస్‌జీఎఫ్ ఖాతాలో జమ చేయడం మర్చిపోతున్నారు. 2018 నుంచి రావాల్సిన ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల బడ్జెట్ దాదాపుగా రూ.16 లక్షల వరకు రావాల్సి ఉంది. అప్పులు చేసి పోటీలు నిర్వహించిన పీఈటీలు ఆటల పోటీలంటే విముఖత చూపుతున్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్తగా క్రీడాపాలసీ తీసుకొస్తామని ప్రకటించడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం నింపుతోంది.

బాసరలో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

- 72 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుడిని 72 గంటల్లో పట్టుకున్నట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం నందిగామ్‌కు చెందిన కొసిడిగా సాయి కుమార్ ఏపనీ చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. గురువారం బాసర ఆలయంలోకి చొరబడి హుండీలోంచి రూ.14,200 నగదు ఎత్తుకెళ్లాడు. రంగంలోకి దిగిన ఎస్పీ జానకీ షర్మిల ఆలయాన్ని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. దొంగను పట్టుకోవడానికి కొంతమంది పోలీస్ సిబ్బందితో ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. సీసీటీవీలో నమోదైన రికార్డు ఆధారంగా ఆదివారం బాసర ఆలయ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న సాయికుమార్‌ను పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి రూ.6,400 విలువైన ఫోన్, రూ.6వేల నగదు, బైక్, హుండీ పగుల గొట్టడానికి ఉపయోగించిన రాయి, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 72 గంటల్లో కేసును ఛేదించిన భైంసా ఏఎస్పీ అవినాష్, సీఐ మల్లేశ్, ఎస్సై గణేశ్, కానిస్టేబుల్ మోహన్‌సింగ్‌ను ఎస్పీ అభినందించారు.

ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం

బాసర ఆలయ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. ఆలయం చుట్టూ చాలా ప్రదేశాలలో సీసీటీవీలు లేవన్నారు. చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు నిఘా ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఈవోకు సూచించారు.

జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య


రాజు (ఫైల్)

నిర్మల్‌టౌన్: ఒంటరితనం భరించలేక జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కడెం మండల కేంద్రానికి చెందిన బాసగుట్ట రాజు (38) లారీ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జిల్లా కేంద్రంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అతని భార్య ఆరేళ్ల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఒంటరితనం భరించలేక ఆదివారం సాయంత్రం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ఇంటి యజమాని తన సోదరుడు శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం బంగారుగూడ డంపింగ్ యార్డ్ సమీపంలో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సయ్యద్ అక్బర్, లతీఫ్ అహ్మద్, షేక్ రవూఫ్, జన్నును అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.20,220 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సీఎంను అవమానించారని కేసు

బజార్‌హత్నూర్: రెండు లక్షల రుణమాఫీ చేయలేదని ఆదివారం మండల కేంద్రంలో కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రైతులను కూడగట్టి సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మతో శవయాత్ర నిర్వహించి అనంతరం దహనం చేసిన విషయం తెలిసిందే. సీఎంను అవమానించారని మండలానికి చెందిన డుబ్బుల చంద్రశేఖర్, అల్కే గణేశ్, చట్ల వినీల్, తురాటి భోజన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అప్పారావ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బెల్లంపల్లి: పట్టణంలోని గంగారాంనగర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై మహేందర్ తెలిపారు. సుభాష్‌నగర్ బస్తీకి చెందిన సొల్లు సమ్మయ్య (42) ఆదివారం రాత్రి రోడ్డు దాటుతుండగా తాండూర్ వైపు నుంచి బైక్‌పై వస్తున్న తోటపల్లి అభినవ్ ఢీ కొట్టాడు. ఘటనలో సమ్మయ్య తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని కుమారుడు సాయి మదన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు

- ఒకరు మృతి, పలువురికి గాయాలు


చంద్రశేఖర్ మృతదేహం

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ గుడి సమీపంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం అడ గ్రామానికి చెందిన మేకల చంద్రశేఖర్ (41) తన కారులో స్నేహితులతో కలిసి హైదరాబాద్ నుండి వస్తుండగా బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ గుడి సమీపంలో రోడ్డుపై నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టారు. ఘటనలో మేకల చంద్రశేఖర్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా కారులో ఉన్న మిగతా ఐదుగురికి గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ బీపీఎం మృతి


శ్రీనివాస్ (ఫైల్)

జన్నారం: అప్పులబాధ భరించలేక పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన పొనకల్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం బాదంపల్లి గ్రామానికి చెందిన వంగపల్లి శ్రీనివాస్ (40) పొనకల్ బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తి గత అవసరాల నిమిత్తం అదే గ్రామానికి చెందిన ఆనందం వద్ద రూ.11 లక్షలు అప్పుగా తీసుకుని తిరిగి రూ.4 లక్షలు చెల్లించాడు. అయితే వాటిని వడ్డీకింద జమ చేసుకున్న ఆనందం ఇంకా రూ.11 లక్షలు ఇవ్వాలని ఈ నెల 8న శ్రీనివాస్ ఇంటికి వెళ్లి అప్పు తీర్చాలని వేధించాడు. దీంతో మనస్తాపానికి గురై గ్రామ సమీపంలో పురుగుల మందు తాగి పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు జన్నారంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుని భార్య సౌజన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రభుత్వ నియంత పాలనకు నిదర్శనం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: రెండు లక్షల రుణమాఫీ చేయాలని నిలదీసిన రైతులపై కేసులు నమోదు చేయించడం ప్రభుత్వ నియంత పాలనకు నిదర్శనమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని రుయ్యాడిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ కానీ రైతులు సీఎం రేవంత్‌రెడ్డి శవయాత్ర నిర్వహిస్తే కేసులు పెట్టించడం సరికాదన్నారు. ప్రభుత్వానికి రైతుల మీద చిత్తశుద్ధి ఉంటే సంపూర్ణ రుణమాఫీ చేయాలన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున రైతు ఉద్యమం చేపడుతామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్, మొట్టె కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్, అబ్దుల్లా, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి


అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో వసంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఏపీవో వసంత్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పింఛన్, రెండు పడకల గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్సీవో రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోదరునికి రాఖీ కట్టేందుకు వచ్చి వృద్ధురాలు మృతి


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఖానాపూర్: సోదరునికి రాఖీ కట్టేందుకు వచ్చిన ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామానికి చెందిన చిన్నమ్మ(70) ఖానాపూర్ మండలం దిలావర్‌పూర్‌లోని తన సోదరుడు రాసమల్ల బద్దయ్యకు రాఖీ కట్టేందుకు ఆదివారం రాత్రి వచ్చింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం బహిర్భూమికి గ్రామ శివారులోని సదర్మాట్ కాలువ వైపు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు గాలించగా కాలువ దిగువ భాగంలోని పాత ఎల్లాపూర్ గ్రామ శివారులోని సైఫాన్ గేటు వద్ద మృతదేహం కనిపించింది. మృతురాలి కుమారుడు ముత్తన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానమే పెనుభూతమై..

- భార్యను హతమార్చిన భర్త
- దండేపల్లి మండలం కాసిపేటలో ఘటన


విమల(ఫైల్)


ఘటన స్థలంలో విమల మృతదేహం

దండేపల్లి: అనుమానమే పెనుభూతమైంది. కట్టుకున్న భర్తే కాలయముడై భార్యను హత్య చేసిన ఘటన దండేపల్లి మండలం కాసిపేటలో చోటు చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాసిపేటకు చెందిన ఆవుల నరేష్, అదే గ్రామానికి చెందిన దుమల్ల విమల (28) 2012లో ప్రేమ వివాహం చేసుకున్నారు. దంపతులకు ముగ్గురు పిల్లలు సంతానం. నరేష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో విమల వేరే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుందని అనుమానిస్తూ తరచూ గొడవ పడేవాడు. ఈ విషయంలో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా నిర్వహించారు. అయిన అతనిలో మార్పు రాలేదు. ఆదివారం విమల ఇంటికి ఆమె తల్లి సునీత, సోదరి సరిత వెళ్లి రాఖీ పండగకు ఇంటికి రావాలని పిలిచారు. ఈ సమయంలో ఇంట్లో ఉన్న నరేష్ కొద్దిసేపటి తర్వాత వస్తుందని చెప్పడంతో వారు వెళ్లిపోయారు. రాత్రయినా రాకపోవడంతో మరోసారి ఆమె ఇంటికి వెళ్లి పిలువగా మాట్లాడలేదు. దీంతో అనుమానం వచ్చి తలుపులు నెట్టగా నరేష్ చేతిలో ఇనుపరాడ్ పట్టుకుని కనిపించాడు. అత్త, వదినను చూసి ఇంట్లో నుంచి పారిపోయాడు. దీంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా విమల తలపై గాయంతో బెడ్‌పై శవమై కనిపించింది. మృతురాలి తల్లి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కల్వర్టును ఢీకొట్టిన పాలవ్యాన్

- ఇద్దరు మృతి, ఒకరికి తీవ్రగాయాలు
- పండుగ పూట విషాదం...


భద్ర (ఫైల్)


మల్లేష్ (ఫైల్)


పాల వ్యాన్‌లో మృతదేహాలు

కాసిపేట: ఒకవైపు రాఖీ పౌర్ణమి సందర్భంగా అంతా సిద్ధమవుతున్న క్రమంలో సోమవారం తెల్ల వారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మండలం అందుగులపేటకు చెందిన డ్రైవర్ నవనందుల మల్లేశ్ (22), మందమర్రికి చెందిన బైరినేని భద్ర (18), బైరినేని శంకర్ సోమవారం తెల్లవారు జామున సుమారు 2:30 గంటలకు వ్యాన్‌లో పాల ప్యాకెట్లు వేసుకుని బెల్లంపల్లిలో పంపిణీ చేసేందుకు వెళ్తుండగా డ్రైవర్ నిద్ర మత్తులో అతివేగంగా కల్వర్టును ఢీ కొట్టాడు. భద్ర, మల్లేశ్‌కు తీవ్రగాయాలు కావడంతో క్యాబిన్‌లోనే మృతి చెందారు. శంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగానే ఉంది. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగును ఆకర్షించిన ఫోన్

- వర్షంలో ఫోన్ మాట్లాడుతుండగా ఘటన
- అక్కడికక్కడే మృతి చెందిన రైతు
- పండుగపూట బిట్టూర్‌పల్లిలో విషాదం


భాస్కర్‌గౌడ్ (ఫైల్)


భాస్కర్‌గౌడ్ మృతదేహం

భీమిని: అంతా సంతోషంగా రాఖీ పండుగ జరుపుకుంటున్న వేళ పిడుగుపాటు ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని బిట్టూర్‌పల్లికి చెందిన జక్కుల భాస్కర్‌గౌడ్ (56) గ్రామ పరిధిలోని చెరువు కింద వరి సాగు చేస్తున్నాడు. పొలానికి సాగునీరు అందించేందుకు నలుగురితో కలిసి సోమవారం కాలువ మరమ్మతు పనులు చేస్తున్నారు. ఇంతలోనే భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియడంతో భాస్కర్ గౌడ్ స్థానికంగా ఉన్న ఈత చెట్టు కిందికి వెళ్లాడు. తన ఆండ్రాయిడ్ మొబైల్‌తో ఫోన్‌లో మాట్లాడుతుండగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య సువర్ణ, కుమారులు ప్రసాద్, గణేశ్, కూతురు సంగీత ఉన్నారు.

కుటుంబంలో విషాదం

రాఖీ పండుగ పూట భాస్కర్‌గౌడ్ భార్య సువర్ణ తన అన్నకు రాఖీ కట్టి వస్తానని చెప్పి కాసిపేటకు వెళ్లింది. మృతుని సోదరి కుమురంభీం జిల్లా వాంకిడి మండలం కమానా గ్రామం నుంచి భాస్కర్‌గౌడ్‌కు రాఖీ కట్టేందుకు బయలు దేరింది. కూతురు సంగీత మందమర్రి నుంచి తన సోదరులకు రాఖీ కట్టేందుకు వస్తుండగా మరణవార్త తెలియడంతో అందరూ దిగ్భ్రాంతికి గురయ్యారు. రాఖీ పౌర్ణమి ఎంతో సంతోషంగా జరగాల్సిన ఇంట్లో చావుడప్పు మోగడం అందర్నీ కలిచివేసింది. మృతుని కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమిని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

శ్రీసంత్ ప్రేమ్‌సింగ్ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలి



ఆశీర్వాదం తీసుకుంటున్న అనిల్ జాదవ్

నార్నూర్: దీక్ష గురువు శ్రీసంత్ ప్రేమ్‌సింగ్ మహరాజ్ అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరు నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి హెచ్ గ్రామంలో గల జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద దీక్ష గురువు శ్రీసంత్ ప్రేమ్‌సింగ్ జన్మదిన వేడుకలతో పాటు రాఖీ పౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దీక్ష భూమి వద్ద నిర్వహించిన మహాపూజ, భోగ్ బందారో పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మహరాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. నాయకులు బానోత్ గజానంద్ నాయక్, జాదవ్ శ్రీరామ్, ఆడే సురేశ్, రూప్‌దేవ్, సయ్యద్ ఖాశీం, శ్రీరామ్, ప్రభాకర్, రామేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఉమ్రా యాత్రికుడికి సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన దివ్యాంగుడు సయ్యద్ అలీమ్‌ను హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయన ఇటీవల పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లివచ్చారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి ఫైజల్ అహ్మద్, కోశాధికారి సయ్యద్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి మహరాజ్‌పై ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని జల్‌గామ్‌కు చెందిన రామగిరి మహరాజ్‌పై మజ్లిస్ తహఫూజ్ ఖత్మే నబూవత్ సభ్యులు సోమవారం ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌కు ఫిర్యాదు చేశారు. మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ముస్లింల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ముఫ్తి సర్దార్ ఖాస్మి, ఖీజర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఇచ్చోడ: మేజర్ పంచాయతీ పరిధిలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. మరుగుదొడ్డి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకునే వారికి నిర్మాణం కోసం సొంత స్థలం ఉండాలన్నారు. జాబ్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌తో పాటు మొబైల్ నంబర్ రాసి దరఖాస్తును పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

ఇంటింటా జ్వరబాధితుల సర్వే




రోగులకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఇస్లాంపూర కాలనీలో సోమవారం జ్వరబాధితుల సర్వే నిర్వహించారు. ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటా తిరుగుతూ జ్వరాల బారిన పడిన వారి పేర్లను నమోదు చేసుకున్నారు. ఇస్లాంపూరలో ఆరోగ్య శిబిరం నిర్వహించి 43 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెల్త్‌అసిస్టెంట్ ఉత్తంసింగ్, కైలాస్, సుభాష్, రాజ్‌కిరణ్, వసంత్, ఏఎన్ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సహాయ ఉపకరణాల ఎంపికకు శిబిరాలు

ఇచ్చోడ: దివ్యాంగులకు అవసరమైన సహాయ ఉపకరణాలు అందజేసేందుకు ఎంపిక కోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కుల నారాయణ తెలిపారు. సోమవారం ఇచ్చోడలో ఆయన మాట్లాడారు. దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమశాఖ, హైదరాబాద్ అలింకో ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20న నార్నూర్ జెడ్పీ పాఠశాల, 21న బోథ్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, 22న ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ గెజిటెడ్ పాఠశాలలో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'రైతులను అరెస్టు చేయడం సరికాదు'



మాట్లాడుతున్న సంగేపు బొర్రన్న

తలమడుగు: రైతు రుణమాఫీ కాని రైతులు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడితే అరెస్టు చేయడం సరికాదని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగేపు బొర్రన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రుణమాఫీ అర్హులందరికి చేయకుండా కోతలు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. రైతులు సుదర్శన్ రెడ్డి, సురేశ్ రెడ్డి, భూమన్న, గంగాధర్, పోతరెడ్డి, సతీశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా 'రక్షాబంధన్'



ఇచ్చోడ: రాఖీ కట్టిన గాడ్గే మీనాక్షికి స్వీట్ తినిపిస్తున్న కేటీఆర్



ఆదిలాబాద్‌టౌన్: ముస్లిం సోదరుడికి రాఖీ కడుతున్న అంగన్‌వాడీ కార్యకర్త కవిత



ఆదిలాబాద్‌టౌన్: చిన్నారులకు రాఖీలు కడుతున్న అంగన్‌వాడీ కార్యకర్త రాధ

జిల్లాలో రక్షాబంధన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సోదరసోదరీమణుల అనురాగానికి ప్రతీక అయిన రాఖీ సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టారు. ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సైతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాంసి మండలం కప్పర్ల గ్రామంలో మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, సోదరుడు సంతోష్‌కు రాఖీ కట్టి స్వీట్ తినిపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావుకు ముఖరా(కే) మాజీ సర్పంచ్ గాడ్గేమీనాక్షి హైదరాబాద్‌లో రాఖీ కట్టారు. - సాక్షి నెట్‌వర్క్



నార్నూర్: బాలికల ఆశ్రమ పాఠశాలలో..



సిరికొండ: రాఖీ కట్టి అన్నకు హెల్మెట్ బహూకరిస్తున్న చెల్లెలు



బజార్‌హత్నూర్: టీజీబీలో రాఖీ వేడుకలు..



కైలాస్‌నగర్: కంది శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి



తాంసి: సోదరుడికి రాఖీ కడుతున్న గండ్రత్ సుజాత



నేరడిగొండ: గజేందర్‌కు రాఖీ కడుతున్న సోదరి



ఉట్నూర్‌రూరల్: కోదండరాంకు రాఖీ కడుతున్న సుగుణ



నేరడిగొండ: సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో..

పారిశుధ్య లోపం.. ప్రజలకు శాపం



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని యశ్వంత్‌గూడ గ్రామ పంచాయతీ కార్యాలయం. గ్రామ పంచాయతీ చుట్టూ పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పే అధికారులు జీపీ చుట్టూ అపరిశుభ్రంగా ఉన్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది మండలంలోని బూర్నూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం. ఈ కేంద్రానికి ప్రతీ రోజు చిన్న పిల్లలు వస్తుంటారు. కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. దీంతో దోమలు వృద్ధి చెందడంతో పాటు విష పురుగులు వచ్చే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బూర్నూర్ గ్రామంలో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం
- పెరుగుతున్న దోమలు వ్యాప్తి
- అనారోగ్యం బారిన పడే ప్రమాదం
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం లోపించడంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో రోడ్లపైనే వర్షపు నీరు, మురుగు నీరు నిలిచిపోవడం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల సమీపంలో విపరీతంగా పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో దోమలు వృద్ధి చెంది అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2 నుంచి 9 వరకు ప్రతీ గ్రామంలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టింది. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించే గ్రామ పంచాయతీ అధికారులు వారి జీపీల చుట్టూ అపరిశుభ్రంగా ఉన్న పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. దాదాపు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టడం లేదు. మండల స్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతోనే ఇలాంటి దుస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



మండలంలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించాం. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకున్నాం. దోమల వ్యాప్తి అరికట్టేందుకు వర్షపు నీరు నిల్వ ఉండకుండా, పిచ్చి మొక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా అపరిశుభ్రత లోపిస్తే చర్యలు తీసుకుంటాం.

– ఆనంద్, ఎంపీవో

'భారత్ బంద్' విజయవంతం చేయాలి



ఉట్నూర్‌రూరల్: మాట్లాడుతున్న దాసండ్ల ప్రభాకర్

ఇంద్రవెల్లి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహించనున్న భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని అంబేద్కర్ మెమోరియల్ అ సోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కాంరాజ్, ఉపాధ్యక్షుడు పవార్ శివాజీ, కోశాధికారి కాంబ్లే సునీల్, దళిత సంఘాల నాయకులు మోరే దిలీప్, వావల్కర్ శివాజీ, భవాలే సత్యానంద్, సుద్ధోధన్, ఆచార్య దత్త, సునీల్, కాంబ్లే ధమ్మనంద్, సుమిత్, రూపేశ్ తదితరులు ఉన్నారు.

నార్నూర్: ఎస్సీ, ఎస్టీలను వర్గీకరిస్తూ సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 21న జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మహర్ బెటాలియన్ జిల్లా నా యకుడు, పీపీసీఎస్ డైరెక్టర్ దుర్గే కాంతరావు అన్నారు. సోమవారం ఇందిరనగర్‌లో ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉట్నూర్‌రూరల్: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాల మహానాడు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం భారత్ బంద్ నిర్వహించాలని మాల మహనాడు జాతీయ ప్రధాన కార్యదర్శి దాసండ్ల ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు సహకరించాలని కోరారు. కాటం రమేశ్, గొల్లపల్లి నర్సయ్య, తొటి ఆశన్న, దూట రాజేశ్వర్, సుభాష్, సతీశ్, మహేందర్, ప్రభాకర్‌రావు, వినోద్, సుశీల్, అచ్చనందం, రాజు తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: ఈనెల 21న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మండల మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు క్రాంతి కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. నాయకులు గంగన్న, సురేందర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ముత్నూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎంపీలు

ఇంద్రవెల్లి: కోల్‌కత్తాలో విధుల్లో ఉన్న డాక్టర్‌పై అత్యాచారం చేసి, హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని సోమవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో యువకులు ప్రధాన రహదారిపై క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పోచ్చమ్మ తల్లి నుంచి కుమురం భీం విగ్రహం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. గ్రామ పటేల్ హెరే కుమ్ర జంగు, యువకులు ఆత్రం రాంచందర్, కేంద్రే గణేశ్, కాంబ్లే బాలాజీ, అనిల్, దుర్వ రమణ, శివాజీ తదితరులు ఉన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

ఎదులాపురం: వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు కారకులైన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మడవి రేణుక, సీపీఐ ఎంఎల్ ఆదిలాబాద్ మండల కార్యదర్శి కుమ్ర అశోక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కొమరం భీం భవనంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నాయకులు సురేశ్, వసంతరావు, బుచ్చిరాం, వనిత, సావిత్ర, లక్ష్మి, రుక్మ తదితరులు పాల్గొన్నారు.

'అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ'



తలమడుగు: ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

తలమడుగు: అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ జరుగుతుందని, ఆందోళన చెందవద్దని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండలంలోని సుంకిడి గ్రామంలో రైతురుణమాఫీ పథకంలో లబ్ధిపొందిన తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల రైతులు పెద్దఎత్తున తరలివచ్చి సుంకిడి గ్రామంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రైతులు పెద్దఎత్తున ఎడ్లబండ్లపై డప్పు చప్పుళ్లతో గ్రామంలో వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేస్తుందన్నారు. మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, వెంకన్న యాదవ్, బాబన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, మాజీ ఎంపీపీలు లక్ష్మి రాజేశ్వర్, శ్రీధర్ రెడ్డి, లింగారెడ్డి, గొర్ల రాజు, ప్రఫుల్ రెడ్డి, పోతారెడ్డి, నరేశ్, అశోక్, రఘు, ప్రవీణ్ రెడ్డి, సాంబశివ, ప్రతాప్, తిరుపతి, రఫీక్, పోతన్న, నారాయణ, రాంచందర్, బాబుఖాన్, గంగారం తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అవుతుందని, రైతులు ఎలాంటి అపోహలకు గురి కావద్దని మండల వ్యవసాయధికారి జాదవ్ కై లాస్ అన్నారు. సోమవారం మండలంలోని బోరిగామలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సాంకేతిక కారణాల వల్ల కొంతమంది పేర్లు జాబితాలో లేవన్నారు. ఇప్పటివరకు రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు.

'రుణమాఫీ పేరుతో మోసం'

తాంసి: రుణమాఫీ పేరుతో రాష్ట్ర రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ భీంపూర్ కన్వీనర్ నాగయ్య యాదవ్ అన్నారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగయ్య మాట్లాడుతూ ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పూర్తిస్థాయిలో మాఫీ చేయకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. మాజీ జెడ్పీటీసీ సుధాకర్, నాయకులు ముకుంద్ సంతోష్, నరేందర్, ఉల్లాస్, రాకేష్ ఉన్నారు.

రైతుల నిరసన

బోథ్: తమకు రుణమాఫీ కాలేదని మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన రైతులు సోమవారం బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతీ రైతుకు రుణాలు మాఫీ చేయాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

ఇంద్రవెల్లిలో భారీ వర్షం

ఇంద్రవెల్లి: మండలకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కు రిసింది. భారీ వర్షానికి మండల కేంద్రంలో ని ర్వహించిన వారసంతలో వ్యాపారస్తులు, ప్రజ లు ఇబ్బందులకు గురయ్యారు. వరద నీటితో వాగులు పొంగిపొర్లడంతో మండలంలోని మా మిడిగూడ, చిత్తబట్ట, జైత్రంతండా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

బోథ్ ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

బోథ్: బోథ్ ఎస్సైగా ప్రవీణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన రాము నిజామాబాద్ జిల్లాకు బదిలీ కాగా, నిజామాబాద్ జిల్లా నుంచి ప్రవీణ్ బోథ్ ఎస్సైగా బదిలీ అయ్యారు.

రుణమాఫీపై సందేహాలు నివృత్తి చేసుకోండి

బోథ్: రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతోందని మండల వ్యవసాయధికారి వెండి విశ్వామిత్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులు అనుమానాలు పెట్టుకోవద్దని, సందేహాలు ఉంటే రైతువేదికలో సంప్రదించాలన్నారు.

ఘనంగా సంతోషిమాత జన్మదిన వేడుకలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో సోమవారం సంతోషిమాత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెడ్డి కాలనీ నుంచి అమ్మవారి పట్టువస్త్రాలతో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఆవరణలో ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సామ అనురాజ్‌రెడ్డి, నిమ్మల గోవర్ధన్ రెడ్డి, భీంరెడ్డి పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేయాలి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఆదిలాబాద్: ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దొడ అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ తరంగణి ఫంక్షన్ హాల్‌లో సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ ఆద్యుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ కోశాధికారి సంతోష్, కార్యదర్శి విశాల్, సీనియర్ ఫొటోగ్రాఫర్లు మురళీధర్ అహుజా, అనిల్ దేశ్పాండే, కస్తూరి కిరణ్ కుమార్, విశాల్, రమేశ్, సంజయ్, రాజు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ఫొటోగ్రాఫర్లు 185వ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా లూయిస్‌డ్యాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురేశ్, అన్వేష్, సంతోష్, వినోద్, రాము, ప్రవీణ్, సాయి, గణేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు

బోథ్: చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పోలీసు యాక్టు 30 అమలులో ఉందన్నారు.